

రేపు రాష్ట్రస్థాయి ఉర్దూ సాహితీ సమ్మేళనం

దోమకొండ, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని గడికోటలో శనివారం రాష్ట్రస్థాయి ఉర్దూ సాహితీ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గడికోట సీనియర్ మేనేజర్ బాబ్జి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. చీఫ్ గెస్ట్‌గా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, స్పెషల్ గెస్ట్‌గా ఎస్పీ సింధూశర్మ ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.





గృహజ్యోతి అమలుకు కసరత్తు

కామారెడ్డి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు వేగంగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను విజయవంతంగా అమలు చేపడుతోంది. అయితే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆరు గ్యారెంటీల్లోని మరో రెండు సంక్షేమ పథకాలను ఈ నెలలోపు అమలు చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్ సైతం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా నివాస గృహాలకు ఉచిత విద్యుత్ అమలుపై విద్యుత్‌శాఖ చర్య లు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో విద్యుత్ శాఖ 200ల యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే వారి వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా విద్యుత్‌శాఖ వివరాలను సేకరిస్తోంది. ఈనెల 15 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

వివరాలు సేకరిస్తున్నాం

● రమేష్‌బాబు, విద్యుత్‌శాఖ ఎస్ఈ, కామారెడ్డి

ఉచిత విద్యుత్‌కు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఆయా గృహాలకు వెళ్లి విద్యుత్ సిబ్బంది దరఖాస్తుదారు పేరు, మీటర్ నెంబర్, ఆధార్, సెల్ నెంబర్ నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమాని అనుమతితో కిరాయిదారులు ఉంటే వారి వివరాలను నమోదు చేస్తారు. ఈ నెల 15లోగా దరఖాస్తుదారుల వివరాల ప్రక్రియ పూర్తి చేస్తాం.

జిల్లాలో మొత్తం 4.22 లక్షల విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 4,22,029 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో కేటగిరి-1 కిందకు వచ్చే గృహ విద్యుత్ కనెక్షన్లు 2,67,787 ఉన్నాయి. కేటగిరి-5లోని వ్యవసాయ కనెక్షన్‌లు 1,09,436 ఉన్నాయి. మిగతా 64 విద్యుత్ కనెక్షన్‌లు పరిశ్రమలకు సంబంధించినవి. అయితే 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే కనెక్షన్లు 2.30 లక్షలు ఉన్నట్లు విద్యుత్‌శాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. వీరిలో ఎంత మందికి ఉచిత విద్యుత్ వర్తించనుందో త్వరలో తేలనుంది.

దరఖాస్తుల ఆధారంగా వివరాల సేకరణ

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహలక్ష్మి పథకం అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా 200ల యూనిట్ల వరకు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు మంత్రి వర్గం సైతం ఆమోదం తెలిపింది. ఇటీవల ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్న విషయం తెలిసిందే. అందులో గృహజ్యోతికి సంబంధించి దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను విద్యుత్‌శాఖ సిబ్బంది ఆయా ఇళ్లకు వెళ్లి అర్హులైన దరఖాస్తుదారుల విద్యుత్ కనెక్షన్ నెంబర్, ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నెంబర్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 15 వరకు కొనసాగనుంది.

- 200ల యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే వారి వివరాల సేకరణ
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 4.22లక్షల విద్యుత్ కనెక్షన్లు
- ఇందులో 2.67లక్షల గృహ వినియోగ కనెక్షన్లు
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక
- ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నెంబర్ నమోదు చేస్తున్న విద్యుత్ సిబ్బంది
- కిరాయిదారులకు సైతం ఉచిత విద్యుత్ వర్తింపచేసే ఆలోచన
- ఈనెల 15 వరకు సాగనున్న ప్రక్రియ

కిరాయిదారులకు ఉచిత విద్యుత్ వర్తించేనా?

ఇళ్లు లేని వారు ఇతరుల ఇళ్లలో కిరాయి ఉంటున్నారు. వారు ఉండే పోర్షన్ విద్యుత్ మీటర్‌కు కిరాయిదారుల వివరాలను నమోదు చేస్తారు. సదరు కిరాయిదారులు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా చేసుకోకపోయినా ఇంటికి విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు వారిపేరు, విద్యుత్ కనెక్షన్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఇంటి యజమాని అభ్యంతరం తెలిపితే మాత్రం నమోదు చేయ వద్దని అధికారులు సిబ్బందికి సూచించినట్లు సమాచారం.



ఈ నెలలోపే ఉచిత విద్యుత్ అమలు

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ కూడా త్వరలో వచ్చే అవకాశం ఉంది. ఆలోపే ఉచిత విద్యుత్, రూ.500ల గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ వస్తే ఈ రెండు పథకాలు అమలు చేయడం సాధ్యం కాదు. మహిళా ఓటర్లను పార్లమెంట్ ఎన్నికల్లో ఆకర్షించాలంటే ఈ రెండు పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఈనెల 15లోగా ఉచిత విద్యుత్ సంబంధించి లబ్ధిదారుల వివరాల నమోదు, ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రత్యేకాధికారులకు పరీక్ష

- ప్రత్యేకాధికారులుగా నియామకమైన ఆయా శాఖల అధికారులు
- వారి శాఖ పనులతో పాటు గ్రామ పంచాయతీ పనులు
- ఇంటి పన్నుల వసూళ్ల భారం
- వేసవిలో నీటి కష్టాలపై అధికారులు ఎదుర్కొనేనా?
- ఇప్పటికే మొదలైన పల్లె పరిశుభ్రత పనులు
- ఈనెల 14 వరకు కొనసాగునున్న పారిశుధ్య కార్యక్రమాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8: గత వారం రోజుల క్రితం సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇతర విభాగాల అధికారులకు ప్రత్యేకాధికారులుగా గ్రామ పంచాయతీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. గ్రామాల స్వచ్ఛతకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ వారం రోజుల పాటు పలు ప్రత్యేక పనులకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువత, ఎస్‌హెచ్‌జీ గ్రూపులను భాగస్వామ్యులను చేయాల్సి ఉంటుంది. అయితే పార్లమెంట్ ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన చేసి అప్పటి వరకు పల్లెపాలన బాధ్యతలు ప్రత్యేక అధికారులకు అప్పజెప్పింది. దీంతో సొంతశాఖలోని పనులతో పాటు పల్లెల్లో పనులు చేయడం ప్రత్యేకదికారులకు పరీక్షా కాలంగా మారింది. ప్రస్తుతం మరో నెలన్నరలో ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఇంటి పన్నుల వసూళ్లతో పాటు వేసవికాలం సమీపిస్తుండడంతో తాగునీటి ఎద్దడి, పచ్చదనం పరిశుభ్రత, పంచాయతీల నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తీల చెల్లింపులు వంటి వాటిని భారంగానే మోయాల్సిన పరిస్థితి నెలకొంది.

14 వరకు కొనసాగనున్న పారిశుధ్య పనులు

పల్లెల్లో పారిశుధ్య వారోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిశ్చయించింది. వారం రోజుల పాటు ఒక్కోరోజు ఒక్కో అంశంపై పనులు నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళికలను అధికారులకు సూచించింది. ఇందులో భాగంగా బుధవారం ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించి గ్రామంలోని అన్ని వార్డులను సందర్శించి గ్రామానికి అవసరమైన మౌలిక సౌకర్యాలను గుర్తించడమే కాకుండా పారిశుధ్య ప్రణాళికను సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను సైతం నిర్వహించారు. గురువారం గ్రామాల్లోని గుంతలుగా మారిన రోడ్లను బాగు చేసి, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయనున్నారు. ఈనెల 10న తాగునీటి వనరుల ను తనిఖీ చేసి శుభ్రం చేయడం, వాటిని క్లోరినేషన్ చేసి పైప్‌లైన్‌లు, కుళాయిల వద్ద లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవడం, మురుగునీరు నిల్వకుండా చూడడంతో పాటు అందులో ఆయిల్ బాల్స్ వేయడం, యాంటి లార్వా నిర్మూలనకు రసాయనాలను చల్లి, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, 12న నర్సరీలు, పీపీవీల రక్షణకు చర్యలు, పాడు బడి ప్రమాదంగా మారిన బావులను పూడ్చివేసి వృథాగా ఉన్న బోర్లను మూసివేయడం, ఖాళీ ప్లాట్లలోని చెత్తను, మొక్కలను తొలగించడం, 13న గ్రామాల్లోని వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అవగాహన, మరుగుదొడ్లు అవసరమైన వారిని గుర్తింపు, కిచెన్‌గార్డెన్‌లు, సోఫ్‌పిట్స్ నిర్వహణకు చర్యలు, 14న అన్ని నర్సరీలు, పీపీవీలను సందర్శించి మొక్కలకు నీరు అందించడం లాంటివి చేసే విధంగా ప్రణాళికలు రచించారు. అయితే గ్రామాల్లో శ్మశానవాటికలు, సెగ్రిగేషన్‌షెడ్స్ నిర్వహణ, పంచాయతీల్లో నిధుల లేమీతో ట్రాక్టర్‌లు, ట్యాంకర్లు మూలకు పడేశారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడు రోజుల పారిశుధ్య పనులు చేయించడం ప్రత్యేకాధికారులకు సవాల్‌గానే మారనుంది.

ఇంటి పన్ను వసూళ్లు.. నీటి ఎద్దడి కష్టాలను ఎదుర్కొనేనా?

వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడం ప్రత్యేకాధికారులకు కీలకంగా మారింది. గతంలో వేసవి వచ్చిందంటే ఖాళీ బిందెలతో సర్పంచ్‌లను, అధికారులను అడ్డుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా గాంధారి, మాచారెడ్డి, రాజంపేట తదితర మండలాల పరిధిలో తండాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక ఫోకస్ చేసేందుకు కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పన్నుల వసూళ్ల విషయంలో కొందరు సర్పంచ్‌ల అంతగా పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున బకాయిలు పేరుకపోయినట్లు పలువురు ప్రత్యేకాధికారులు పేర్కొంటున్నారు. మరో నెల పదిహేనురోజులే ఆర్థిక సంవత్సరానికి గడువు ఉండడంతో కొత్తగా బాధ్యతలు తీసుకున్న ప్రత్యేకాధికారులకు తలకుమించిన భారంగానే మారుతుంది. ప్రత్యేకాధికారులుగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, నీటి పారుదల తదితరశాఖలకు చెందిన అధికారులను నియమించడం వారికే రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలు అప్పగించడంతో వారి శాఖ పనులతో పాటు ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి రావడంతో సతమతం అవుతున్నారు.

అసంపూర్తి వివరాలను సరి చేయాలి

● కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: ప్రజాపాలన సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తుల్లో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వివరాలను వెంటనే సేకరించి నిర్ధారిత యాప్‌లో పొందుపరచాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్వే బృందాలను ఆదేశించారు. గురువారం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అభయహస్తం కింద ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించే పథకం త్వరలో అమలు చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించగా సరైన వివరాలు పేర్కొనలేదని గమనించి తిరిగి అట్టి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రధానంగా దరఖాస్తులో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్జ్యూమర్ నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ వంటి వివరాలను ప్రజలు సరిగా పొందుపర్చలేదని అన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ నష్ట పోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరి చేయుటకు ఏర్పాటు చేసిన యాప్‌ను రూపొందించింద ని, తప్పిదాలను సరి చేయుటకు ఏర్పాటు చేసిన గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయి బృందాలు ఆ ప్రాంతాల్లో పర్యటించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలు ఈ నెల 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

లెక్క తేలింది

- తుది ఓటరు జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలు
- ఈ పార్లమెంట్ పరిధిలో మెజార్టీ అసెంబ్లీలు కామారెడ్డి జిల్లాలోనే
- లోక్‌సభ పరిధిలో మొత్తం 16,33,075 ఓట్లు
- ఇందులో మహిళల ఓట్లే ఎక్కువ
- మహిళలవి 8,33,851 ఓట్లు, పురుషులవి 7,97,700 ఓట్లు



కామారెడ్డి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను చకచక చేపడుతోంది. ఇందులో భాగంగా మొదటి ఘట్టమైన తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఫైనల్ ఓటరు జాబితాను ఖరారు చేస్తూ జిల్లా అధికారులు విడుదల చేశారు. పార్లమెంట్ పరిధిలోని మొత్తం ఓట్లు 16,33,075 ఉండగా ఇందులో మహిళా ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. మహిళల ఓట్లు 8,33,851 ఉండగా, పురుషులవి 7,97,700 ఓట్లు, థర్డ్ జండర్‌వి 63 ఓట్లు ఉన్నాయి. తుది ఓటరు జాబితాను ఎన్నికల కేంద్రం విడుదల చేయడంతో ఇక షెడ్యూల్ ప్రకటనే మిగిలి ఉంది. దీంతో షెడ్యూల్ ఎప్పుడు వస్తుందా అని అన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర వర్గాల్లోనూ చర్చ సాగుతోంది.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోకి కామారెడ్డి జిల్లాతో పాటు సంగారెడ్డి జిల్లాలు వస్తాయి. ఈ పార్లమెంట్ పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కామారెడ్డి జిల్లాలోని నాలుగు, సంగారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. జనరల్ ఓట్లతో పాటు ఎన్ఆర్ఐ, సర్వీసు ఓట్లు కలుపుకొని మొత్తం 16.33లక్షల ఓట్లు ఉన్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ నియోజక వర్గంలో మొత్తం ఓట్లు 2,73,071 ఉండగా ఇందులో పురుషులవి 1,36,574 ఓట్లు, మహిళలవి 1,36,391ఓట్లు, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు ఉన్నాయి. నారాయణఖేడ్ నియోజక వర్గంలో మొత్తం ఓట్లు 2,35,638 ఉండగా పురుషులవి 1,18,064 ఓట్లు, మహిళలవి 1,17,498 ఓట్లు, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి. ఆందోల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,49,451 ఉండగా పురుషులవి 1,22,031ఓట్లు, మహిళలవి 1,27,364 ఓట్లు, థర్డ్ జండర్‌వి 8 ఓట్లు ఉన్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,54,444 ఉండగా పురుషులవి 1,22,264ఓట్లు, మహిళలవి 1,32,014 ఓట్లు, థర్డ్ జండర్‌వి 20 ఓట్లు ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,22,698 ఉండగా పురుషులవి 1,06,383 ఓట్లు, మహిళలవి 1,15,355 ఓట్లు, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,02,079 ఉండగా పురుషులవి 99,118ఓట్లు, మహిళలవి 1,02,814 ఓట్లు, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,95,694 ఉండగా పురుషులవి 93,266 ఓట్లు, మహిళలవి 1,02,415 ఓట్లు, థర్డ్ జండర్‌వి 13 ఓట్లు ఉన్నాయి.

జ్ఞానాన్ని పొందడమే అసలైన విద్య

కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి సత్యనారాయణ

భిక్కనూరు, ఫిబ్రవరి 8: డిగ్రీలు పొందడం కాదు జ్ఞానాన్ని పొందడమే అసలైనా విద్య అని కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి సత్యనారాయణ అన్నారు. గురువారం భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో 'ఉన్నత విద్య - ఉపాధి అవకాశాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాలయాలు విద్యతో పాటుగా సమాజంలోని సమస్యల పరిష్కారాలను చూపే విధంగా ఉండాలన్నారు. క్యాంపస్‌లో చేరిన రెండు సంవత్సరాలు విద్యార్థులకు బంగారు లాంటి అవకాశమన్నారు. ప్రతీ విద్యార్థి నిరాశవాదిగా కాకుండా ఆశావాదిగా ఉంటూ లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉద్యోగాలు సాధించే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. 2047 వరకు భారత్ పూర్తిగా అభివృద్ధి చెందిన వికసిత్ భారత్‌గా కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్‌ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



గురువారం జరిగిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు హాజరైన బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత



నెంబర్ ప్లేట్ లేని బైక్‌లు సీజ్

● వాహనదారులకు కౌన్సిలింగ్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 8: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో గురువారం నెంబర్‌ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఈస్పెషల్‌డ్రైవ్‌లో నెంబర్‌ప్లేట్‌లేని తొమ్మిది బైకులను సీజ్ చేసి వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం నెంబర్‌ప్లేట్‌లను బిగించి వారికి పంపినట్లు చెప్పారు. నెంబర్‌ప్లేట్‌లు లేని వాహనాలను చైన్‌స్నాచింగ్, దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారని వాహనదారులు నిబంధనలను పాటించాలని, హెల్మెట్‌లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

'డీసీసీబీ చైర్మన్ తీరు మార్చుకోవాలి'

కోటగిరి, ఫిబ్రవరి8: డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎంపీటీసీ కొట్టం మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను పట్టించుకుని బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన తర్వాత కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షాహీద్, గంగాధర్ దేశాయ్, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగించుకోవాలి

మోపాల్, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి.ధర్మనాయక్ అన్నారు. గురువారం బోర్గాం(పి), పాంగ్రా గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్దిదారులకు అందించాలని లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన సంక్షేమ పథకాలను లబ్దిపొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం.నాగశ్రీనివాస్,కార్పోరేటర్ సౌజన్య, బీజేవైఎం. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మానాయక్

రైతులకు కొనుగోలు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి



మందులను పరిశీలిస్తున్న అధికారులు

నందిపేట, ఫిబ్రవరి8: రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుల మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వాజీద్‌హుస్సేన్ డీలర్లకు ఆదేశించారు. గురువారం నందిపేట మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలు, పురుగు మందుల షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, భౌతిక నిల్వల రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఏరువుల జాబితా ధృవీకరణ యాప్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ జిల్లా అధికారి వాజీద్‌హుస్సేన్ మాట్లాడుతూ రైతులకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలని ఇస్తూ ఎరువులు, పురుగు మందుల ధరల పట్టికను అందరికీ కనిపించే విధంగా పెట్టుకోవాలని సూచించారు. అంతే కాకుండా స్టాకు వివరాలను సైతం రైతులకు కనిపించే విధంగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీలర్లకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జ్యోత్స్న భవాని, మండల వ్యవసాయ విస్తరణ అధి కారులు దుంప విజయ్, గంగాధర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిరికొండ, ఫిబ్రవరి 8: వరంగల్ జిల్లా ధర్మసాగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల పోటీలకు ఇద్దరు చీమన్‌పల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు నవీన్ తెలిపారు. చీమన్‌పల్లి హైస్కూల్‌కు చెందిన మాలవత్ నితిన్, బూక్య రాహుల్ ఆర్మూర్‌లో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచారని తెలిపారు. జిల్లా జట్టు సెలెక్షన్ సభ్యులు ప్రతిభ చూ పిన రాహుల్, నితిన్‌ను జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 10, 11న వరంగల్ జిల్లా ధర్మసాగర్ పాఠశాల మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పీఈటీ నవీన్ తెలిపారు. ఎంపికైయిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయలు అభినందించారు.

మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి8:పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో వండి విద్యార్థులకు వడ్డించాలని గ్రామ ప్రత్యేక అధికారిణి, వ్యవసాయాధికారిణి దేవిక సూచించారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె అధికారులతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులకు సరిపోయేంత కూర, అన్నం నాణ్యతతో వండి వడ్డించాలన్నారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుజాత, పంచాయతీకార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ సభ్యురాలికి సన్మానం

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి8: ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన పల్వాయి రజనీని గురువారం మాజీ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గోర్త రాజేందర్ సన్మానించారు. హైదరాబాద్‌లో పల్వాయి రజనీని కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వంలో యువకులకు ఉద్యోగాలు లభిస్తాయని ఆశభావం ఆయన వ్యక్తం చేశారు.

నేడు చిలుకల చిన్నమ్మ జాతర

ముప్కాల్, ఫిబ్రవరి8: బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామంలో శుక్రవారం జరిగే చిలుకల చిన్నమ్మ జాతర ఉత్సవాల నిర్వహణ కోసం ఆలయం రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.. ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, తీర్థప్రసాదాల వితరణ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు అర్గుల్ విద్యార్థి ఎంపిక

జక్రాన్‌పల్లి,ఫిబ్రవరి8: రాష్ట్రస్థాయి షాట్‌పుట్ అండర్-12 విభాగం పోటీలకు మండలంలోని అర్గుల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.ప్రణీత్‌రాజ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.సుజాత తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలో విద్యార్థి పాల్గొంటారని ఆమె తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి అసోసియేషన్ అథ్లెటిక్స్‌లో, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలలో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని ఆమె తెలిపారు. షాట్‌పుట్‌లో జిల్లాస్థాయి ప్రథమ స్థానంలో ప్రణీత్‌రాజ్ గోల్డ్‌మెడల్ సాధించారని, 100మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో శశివర్ధన్ సిల్వర్‌మెడల్ సాధించారని, 100మీటర్ల రన్నింగ్‌లో రోహిత్ తృతీయస్థానంలో క్యాసం మెడల్ సాధించారని, 200మీటర్ల రన్నింగ్‌లో రోహిత్ ద్వితీయస్థానంలో సిల్వర్‌మెడల్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను గ్రామప్రత్యేక అధికారి, వ్యవసాయాధికారిణి దేవిక, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

విద్యుత్ వినియోగదారులు వివరాలు వెల్లడించాలి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈసాయిలు కోరారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి గ్రామంలో గృహజ్యోతి పథకం పై ప్రజలకు అవగహన కల్పించారు.200యూనిట్ల కరెంట్ ఉచిత అమలు కోసం వినియోగదారులు తమ ఆధార్ నంబర్ తో పాటు తెల్లరేషన్ కార్డు వివరా లు ఫోన్ నంబర్‌ను విద్యుత్‌శాఖ అధికారులకు అందజేయాలని కోరారు. గృహజ్యోతి పథకం కోసం సిబ్బందికి గ్రామీణ ప్రజలు సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

సేవలాల్ మహరాజ్ జయంతిని
ప్రభుత్వం అధికారికంగా జరపాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి8: సేవలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు, గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని కలిసి లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు, గిరిజన సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 15న సేవలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా జరిపి ప్రభుత్వం సెలవును దినంగా ప్రకటించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా సానుకూలంగా స్పందించారని జగ్గారెడ్డి తెలిపినట్లు లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు, గిరిజన సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు, గిరిజన సంఘాల నాయకులు మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠత రేపిన పీఏసీఎస్
చైర్మన్, వైస్‌చైర్మన్ అవిశ్వాస తీర్మానం

- కోర్టును ఆశ్రయించిన చైర్మన్ గంగారెడ్డి
- ఓటింగ్ జరిగినా.. ఫలితాలు ప్రకటించొద్దని హైకోర్టు ఆదేశాలు

సిరికొండ ఫిబ్రవరి 8: సిరికొండ పీఏసీఎస్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడుపై డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీస్‌పై శుక్రవారం డీసీవో అధ్యక్షతన జరిగే సమావేశంలో ఓటింగ్ జరుగబోతుంది. పీఏసీఎస్ అధ్యక్షుడు మైలారం గంగారెడ్డి,ఉపాధ్యక్షుడు అయితే ఫిలిఫ్ మెజారిటీ డైరెక్టర్ల విశ్వాసాన్ని కోల్పోయినందున తాము అవిశ్వాస పెడుతున్నట్లు డైరెక్టర్లు డీసీవోకు జనవరి 12న నోటీస్ ఇచ్చారు. ఈ నోటీస్‌పై శుక్రవారం ఎన్నికల జరగుతుందని సహకార శాఖ అధికారులు డైరెక్టర్లందరికి నోటీస్‌లు జారీ చేశారు. అవిశ్వాసంపై మండలంలో తీవ్ర ఉత్కంఠత రేపుతుంది.అవిశ్వాసం వీగిపోతుందా లేక నెగ్గుతుందా అని రైతులు, వివిధ రాజకీయ పార్టీల్లో చర్చోప చర్చలు జరుగుతున్నాయి.క్యాంపుకు వెళ్లిన డైరెక్టర్లతో తీర్మాణానికి మద్దతు ఇచ్చేవారు ఎంతమంది, వ్యతిరేకంగా ఓటేసే వారెవరున్నారని పలు ప్రశ్నలు రేకెత్తిస్తోంది. క్యాంపునకువెళ్లే ముందు డైరెక్టర్లతో విందులు ,వినోదాలు జరిగినట్లు సమాచారం. క్యాంపునకు వెళ్లిన పదిమందిలో ఇద్దరు జారుకుంటే మాత్రం అవిశ్వాసం వీగిపోయినట్లు అవుతోందని సమాచారం.పది మంది డైరెక్టర్లు క్యాంపుకు తరలి వెళ్లగా, అధ్యక్షుడు మైలారం గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు అయితే ఫిలీఫ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అవిశ్వాసంపై ఓటింగ్ జరుపుకోవచ్చు కాని ఫలితాలు మాత్రం వెల్లడించవద్దని సహకార శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నెల 15 లోపు హైకోర్టు డివిజన్ బెంచీకి అప్పీల్ చేసుకోవాలని కోర్టు సూచించినట్లు అధ్యక్షుడు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఫిలీఫ్ తెలిపారు. డైరెక్టర్లు ఆరోపణ ఏమాత్రం సమంజసంగా లేదని తాము కోర్టును ఆశ్రయించమని వారు చెప్పారు. ఏది ఏమైనా శుక్రవారం జరిగే అవిశ్వాస తీర్మానంపై తీవ్ర ఉత్కంఠత నెలకొన్నది.

పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం



పాఠశాలలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన దృశ్యాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8: కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా శ్రీ చైతన్య పాఠశాల కొనసాగుతున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు అన్నారు. గురువారం శ్రీ చైతన్య పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా 8, 9వ తరగతులను కొనసాగిస్తుండడంతో మండిపడ్డ విద్యార్థి సంఘనాయకులు పాఠశాలలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఎంఈవో ఎల్లయ్య అనుమతులు లేవంటూ పాఠశాల తరగతి గదులను సీజ్ చేశారని రెండు రోజుల వ్యవధిలోనే మళ్లీ పాఠశాల యాజమాన్యం తిరిగి అదే తరగతి గదులలో క్లాసులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈరకంగా ప్రైవేట్ పాఠ శాలలకు విద్యాశాఖాధికారులు మద్దతు పలుకుతూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని విద్యాశాఖ అధికారుల తీరుతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. వెంటనే సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ఆజాద్, సందీప్, అరుణ్, విఠల్, సురేష్, బుల్లెట్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

● 7నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ● రెండో రోజు కూడా కొనసాగిన పారిశుధ్య కార్యక్రమాలు ● పాల్గొన్న ఉన్నతాధికారులు, గ్రామస్థులు



ధర్మారంలో పారిశుధ్యవారోత్సవాల వివరాలను ఎంపీడీవో తో తెలుసుకుంటున్న స్పెషల్ ఆఫీసర్



ముప్కాల్‌లో పారిశుధ్యం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీటీసీలు

మాక్లూర్, ఫిబ్రవరి8: గ్రామీణ ప్రాంతాలలో నివాసించే ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతులుగాజీవిస్తారని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. గురువారం మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీటీసీ క్రాంతి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం రెండవ రోజైన గురువారం కొనసాగింది. ఈ నెల 7నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కొనసాగుతుండగా రెండో రోజైన గురువారం గ్రామాలలో మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు రోడ్ల పక్కన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను తొలగించారు. కోస్లీ, అబాపూర్(ఎం), నవీపేటలలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి యోహన్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏవో సురేష్ గౌడ్, తదితరులున్నారు.

డిచ్‌పల్లి:ధర్మారం(బి)పంచాయతీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం పంచాయతీ పరిధిలో చేపట్టిన పనుల ను మండల ప్రత్యేక అధికారి రాజేందర్,ఎంపీడీవో గోపిబాబు కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా స్పెషల్‌ఆఫీసర్ మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వారోత్సవాలను అన్ని గ్రామాల్లో సక్రమంగా నిర్వహించుకోవాలనిసూచించారు.గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పారి శుధ్య వారోత్సవాలపై శ్రద్ధ చూలన్నారు.గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్ప వని హెచ్చరించారు. ఈకార్యక్రమంలోజీపీఈవో రాజలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూరు: ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ పారిశుధ్య వారోత్సవాలు ఈనెల 15వ తేది వరకు కొనసాగుతాయని గ్రామపంచాయితీల ప్రత్యేక అధికారులు పేర్కొంటున్నారు

ముప్కాల్: పల్లెలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలంటు పంచాయ తీకార్యదర్శులకు గురువారం ముప్కాల్ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో దామోదర్ ఆదేశించారు. ఈనెల 15 తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాలను పరిశుభ్రంగా పర్య వేక్షించాలని సూచించారు. ముప్కాల్ మండల కేంద్రంలో సర్పంచ్ పదవీకాలం ముగియడంతో ముప్కాల్ ప్రత్యేక అధికారి డాక్టర్ వి.జగన్నాథచారి, ముప్కాల్ ఎస్సై బాస్కరచారిలు ముప్కాల్ పాత జాతీయరహదారిపై ఉన్న చెత్తను శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మవెంకటరెడ్డి,ఎంపీటీసీలు నాయకుడు పద్మ, కోఆప్షన్ సభ్యుడు మునీరొద్దిన్, పంచాయతీ సెక్రెటరీ, అంగన్‌వాడీలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని కూనేపల్లి గ్రామంలో పారిశుధ్య పనుల ప్రత్యేక వారోత్సవాలలో భాగంగా గురువారం మురికి కాలువలు శుభ్రం చేశారు. నీటి నిల్వలు లేకుండా దోమల నివారణ, ఇంకుడు గుంతల ఏర్పాటు చేసుకుని సరైన సౌకర్యాలకు ప్రాధాన్యత కల్పించాలని వివరించినట్లు ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక వారోత్సవాలలో భాగంగా గ్రామంలోని వాడవాడలా మురికి కాలువలు శుభ్రం చేసి అవగాహన కల్పించినట్లు ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బీజేపీ గావ్‌చలో అభియాన్



గడ్కోల్‌లో ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

పెద్దబజార్,ఫిబ్రవరి 8 :నిజామాబాద్ కంఠేశ్వర్ మండల్ 34డివిజన్ మిర్చికాంపౌండ్,మార్వాడీదేవి రోడ్డులో బీజేపీగావ్‌చలో అభియాన్ కార్య క్రమాన్ని గురువారం నిర్వహించినట్లు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్రఅధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య కేం ద్రం మహజన వాడ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు, నాయకులకు,ఉద్యోగు లను, కులబాంధవులను, రైతుల ను, మహిళలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దోళ్ల గంగా రెడ్డిని డివిజన్ నాయకులుసన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రోషన్‌లాల్ బోరా ప్రతాప్,శ్రీధర్,మధుబాబు,కళ్యాణ్‌బాబు పాల్గొన్నారు.

సిరికొండ: గత పదేళ్లుగా నరేంద్రమోదీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.పల్లెకు పోదాం పదండి కార్యక్రమంలో భాగంగా గురువారం సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో బీజేపీ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రాత్రిగడ్కోల్ గ్రామంలో పల్లెనిద్ర చేసిన దినేష్ ఉదయం లేచి ఇంటింటికి, హోటళ్ల వద్ద ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలను వివరించారు.నరేంద్రమోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరు చేసిన నిధులతోనే గ్రామాల్లో వైకుంఠధామాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. నిరుద్యోగుల కోసం ముద్ర రుణాలు ఇవ్వడం జరగుతుందన్నారు. గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాలను కూడ కేంద్ర ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలుపుతున్న ఘనత ప్రధాని నరేంద్రమోదీదని ఆయన ప్రజలకు వివరించారు. మూడో సారి కూడ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే మోదీని చూసి ఆయన చేపట్టిన అభివృద్ధి సంక్షే మ పథకాలను చూసి పార్లమెంట సభ్యులుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని దినేష్ కులాచారి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి రుమాండ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, రామస్వామి,కొండయ్య, భాస్కర్, శంకర్, సతీష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కోస్లీ, పొతంగల్‌లలో గావ్ ఛలో ఘర్ ఛలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కోస్లీలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్, యోగేష్, కృష్ణ, నర్సింలు, రాహుల్ పాల్గొనగా పొతంగల్‌లో రాజశేఖర్, ఆనంద్, రాజేందర్, ఋషి పండిత్ తదితరులున్నారు.

డిచ్‌పల్లి: భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గావ్‌చలో అభియాన్ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని డిచ్‌పల్లి మండలం లోని సుద్దపల్లి గ్రామంలో నిజామాబాద్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో 51శాతం ఓట్లు సాధించేలా ప్రతీ కార్య కర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేవైఎం జిల్లా కార్యదర్శి సతీశ్‌రెడ్డి, భూషన్, ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ మహేందర్‌గౌడ్, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగిపై కేసు

ఖిల్లా, ఫిబ్రవరి 8: తప్పుడు కులధ్రువీకరణ పత్రం (ఎస్‌సి రిజర్వేషన్)ను ఉపయోగించుకుని ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగం పొందిన వ్యక్తిపై 1వ పట్టణ పోలీసులు కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌వో డి విజయ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చంద్రశేఖర్ అనే వ్యక్తి 1983లో ఎస్‌సి రిజర్వేషన్ కోటా కింద బస్సు కండెక్టర్ ఉద్యోగం పొందాడు. ఉద్యోగ సమయంలో ఎస్‌సి రిజర్వేషన్ సర్టిఫికేట్‌ను జతపరిచాడు. తొలుత కండెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి ఏడీసీగా పదవులు పొంది ఈటీవల పదవీ విరమణ కూడా చేశాడు. అయితే చంద్రశేఖర్ కుల ధ్రువీకరణపై కొందరు ఫిర్యాదుచేశారు. డిపో మేనేజర్ విచారణ జరిపి చంద్రశేకర్‌పై నిజామాబాద్ 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆయన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక క్యాంపు పెట్టాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 8 :సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక క్యాంపులు పెట్టాలని ఐద్వా మహిళ కార్యదర్శి సుజాత అన్నారు. నగరంలోని దుబ్బా బైపాస్ వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న స్వచ్ఛందంగా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెల కొకసారి ప్రత్యేకమైన క్యాంపులు ఏర్పాటు చేస్తామని ఆమె అన్నారు. ప్రాజెక్టు మేనేజర్ మోహిమ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మిశ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

నేడే త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరీ జాతర

సిరికొండ ఫిబ్రవరి 8: మండలంలోని పెద్దవాల్గోట్ సమీపాన గల త్రీహిల్స్ అన్నాపూర్ణేశ్వరి జాతర శుక్రవారం జరుగుతుంది. గురువారం పెద్దవాల్గోట్ గ్రామంలో అన్నాపూర్ణేశ్వరీ దేవీ ఉత్సవ విగ్రహాన్ని భక్తులు, ఆలాయ కమిటీ సభ్యులు పల్లకీలో అలంకరించి అన్నపూర్ణేశ్వరీ దేవిని ప్రభాత్ భేరీ నిర్వహించారు భక్తుల దర్శనార్థం గ్రామలంలో భజనలు చేస్తూ ప్రజల వద్దకు దేవీని తీసుకెళ్లారు. భక్తులు సాహిత్యాన్ని , కానుకలను సమర్పించుకున్నారు.ఆంజనేయ, కుమారస్వామి ఆలాయాల వద్ద యజ్ఞం నిర్వహించారు. దేవీని సాయంత్రం త్రీహిల్స్ కొండపైకి దప్పుల చప్పుళ్ల మధ్య పల్లకీలో తరలించారు. శుక్రవారం ఉదయం నుంచి కొండపై యజ్ఞం నిర్వహించడం జరుగుతోందని ఆలాయల కమిటీ సభ్యులు తెలిపారు. పాటు భక్తులు దేవీని దర్శించుకుని మొక్కులను ముట్టజెప్పుకుంటారు. సాయంత్రం భక్తుల ఆనందోత్సవాల మధ్య రథోత్సవం జరగుతుంది. ఉదయం నుంచి జాతరకు వచ్చే భక్తుల కోసం అన్న సత్రం ఏర్పాటు చేశారు.

సైబర్ నేరాలపై
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధర్పల్లి, ఫిబ్రవరి9: సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వంశీకృష్ణరెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలకు గురికాకుండా ఉండాలని, జాగ్రత్తలను పాటించాలని సూచించారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, కస్టమర్‌కేర్ నెంబర్‌లను గూగుల్ లో అస్సలు వేతకవద్దని, ఆయా సంస్థల అధికార వైబ్ సైట్ నుంచి మాత్రమే కస్టమార్ కేర్ నెంబర్‌లను తెలుసుకోవాలని, అపరిచిత నెంబర్‌లు, ఫెస్‌బుక్ ద్వారా వీడియో కాల్స్‌కు స్పందించవద్దన్నారు. లాటరీ అఫర్‌లు అంటు మెసెజ్‌లను నమ్మవద్దని సూచించారు. వెబ్‌సైట్ అందించే ప్రకటనలను నమ్మవద్దని, వారు ఇచ్చే మోసపూరిత అఫర్‌లకు, ఓఎల్ఎస్, 99ఎకర్స్, మాజిట్రిక్ లాంటి ఆర్మీసోల్జర్‌లు ఆఫీసర్‌లు అంటు ఎవరైనా సంప్రదిస్తే నమ్మి మోసపోవద్దన్నారు. ఈజీ రీటర్న్, కమిషన్ బెస్‌లలో పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. ఫాస్‌వార్డ్, ఓటిపి లాంటి పిన్ వివరాలను ఎట్టిపరిస్థితులకు ఎవరికి తెలియజేవద్దన్నారు. లాటరి తగిలిందంటు ఎవరు మెసెజ్ చేసిన, మెయిల్ పంపించిన నమ్మి ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930నెంబర్‌లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

మహాలక్ష్మీకాలనీ నూతన కార్యవర్గం

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి8: ఆర్మూర్ పట్టణ శివారులోని పెర్కిట్‌లోని మహాలక్ష్మీకాలనీ నూతన కార్య వరాన్ని గురువారం ఎన్నుకున్నారు. మహాలక్ష్మీకాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బాలెరావు గణేష్, ఉపాధ్యక్షునిగా ఇందూర్ విజయ్‌కుమార్, కార్యదర్శిగా గూడ్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కర్తన్ నవీన్, కోశాధికారిగా తాటికొండ కిషన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 5వార్డు కౌన్సిలర్ బండారి ప్రసాద్, 4వార్డు కౌన్సిలర్ పాలెపు రాజును కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, దయాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

‘బిచ్చగాడు అనే పదాన్ని వెనక్కి తీసుకోవాలి’

- ఎమ్మెల్యే స్థాయి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు భావ్యం కాదు ?
- బీఆర్ఎస్ హయాంలో అంతా అవినీతి మయం
- అవినీతిని నిరూపిస్తాం.. ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా....
- మాజీ జడ్పీటీసీ నార్ల రత్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 8: బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన ఏనుగు రవీందర్‌రెడ్డి బిచ్చగాడు అని డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి మాట్లాడటం భావ్యం కాదని , ఆ పదాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు , మాజీ జడ్పీటీసీ నార్ల రత్నకుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు , కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగు రవీందర్‌రెడ్డి బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకే కృషి చేస్తున్నాడన్నారు. ఏనుగు పేరులోనే కాదు , బలంలో కూడా ఏనుగంత శక్తి కలవాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి చేసి ప్రజల్లోకి వెళతుందని , బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ సత్తా చూపిస్తామని, రాబోయే పార్లమెంటు ఎన్నికలలో జహీరాబాద్ పార్లమెంటు స్థానంలో విజయఢంకా మోగిస్తామన్నారు. ప్రోటోకాల్ గురించి మాట్లాడే వారు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ హయాం అంతా అవినీతి మయంగా మారిందని , అవినీతిని నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కాంగ్రెస్ ప్రజల కోసం పనిచేస్తే , బీఆర్ఎస్ ప్రభుత్వం నాయకుల కోసం పనిచేసిందని ఘాటుగా విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారిపై ఉన్న కేసులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో బాన్సువాడ నుంచి 6గురు బీఆర్ఎస్ నాయకులే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు మాసాని శేఖర్‌రెడ్డి, హన్మాండ్లు, నార్ల సురేష్,అఫ్రోజ్, నాగరాజు, నార్ల రాఘవేందర్, అన్వర్, నసీం, శ్రీనివాస్, గంగాధర్, అక్బర్ తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మోపాల్,ఫిబ్రవరి 8:గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మోపాల్ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని ఏళ్లుగా చాలిచాలని వేతనాలతో కార్మికులు పని చేస్తున్నారని వారు తెలిపారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26వేలు రూపాయలు ఇవ్వడంతో పాలు పర్మినెంట్ చేయాలని తెలంగాణా ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికులందరికి పీఎఫ్, ఈఎస్ఐ అమలు అయ్యే విధంగా చూడాలని కోరారు. జీవో-51ని వెంటనే రద్దు చేయాలని కార్మికులకు భీమా వసతిని కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐటికేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయగౌడ్, గంగామల్లు, కార్మికులు గోసంగిరాములు, లక్ష్మణ్, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నకొడప్‌గల్ సహకార సంఘంలో అవిశ్వాస తీర్మానం



అవిశ్వాస వినతిని జిల్లా అధికారికి అందజేస్తున్న డైరెక్టర్‌లు

పిట్లం,ఫిబ్రవరి 8: పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ సహకార సంఘం చైర్మన్ నారాయణరెడ్డి,వైస్‌చైర్మన్ సాయాగౌడ్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం చేశారు. మరో ఏడాది కాలం పాటు చైర్మన్ పదవీకాలం ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడంతో సహకారసంఘం పాలకవర్గంలోని కొందరు డైరెక్టర్‌లు ప్రస్తుతం ఉన్న చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పలువురు డైరెక్టర్‌లు జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా సహకారశాఖ అధికారి శ్రీనివాస్ రావును కలిసి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన పత్రాలను అందించారు. చిన్నకొడప్‌గల్ పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్‌లు ఉన్నారు. నాలుగు సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నారాయణరెడ్డి చైర్మన్‌గా కొనసాగు తున్నారు.వైస్ చైర్మన్‌గా సాయాగౌడ్ కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సొసైటీలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు డైరెక్టర్‌లు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టెందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మెజార్టీ డైరెక్టర్‌లైన 9 మంది చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ తీర్మానం చేశారు. ఈ తీర్మానపత్రాలను జిల్లా సహకారశాఖ అధికారికి అందజేశారు. త్వరలోనే నూతన చైర్మన్‌ను ఎన్నుకొనున్నారని పీఏసీఎస్ పాలకవర్గంలో చర్చసాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘం పరిధిలో 13 మంది డైరెక్టర్‌లు ఉండగా 9 మందితో కలిసి అవిశ్వాసతీర్మానాన్ని జిల్లా అధికారికి అందించామని తెలిపారు.

రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం ఏబీవీపీ నాయకులు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 8: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పట్టణ కార్యదర్శి చరణ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారు తున్న ఆడ బిడ్డలపైన జరిగే అఘాయిత్యాలు మాత్రం మారడం లేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్‌సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో పదోతరగతి విద్యార్థినులు, ఒకే గదిలో ఉంటున్న భవ్యశ్రీ,వైష్ణవి శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని వీరి మరణానికి కారణమైన వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని అన్నారు.నిందితుడు ఆటోడ్రైవర్ ఆంజనేయులును అదుపులోకి తీసుకొని చట్టపరమైనశిక్ష వేయాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆపదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్,రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష, రోహిత్,నవీన్,మానస,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లు 11 వరకు నిలిపివేత

మద్నూర్, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోళ్లు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం అమావాస్య రావడంతో పత్తి బీట్లను నిలిపి వేశామని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు మూడు రోజుల పాటు మార్కెట్‌కు పత్తి తీసుకుని రావద్దని తెలిపారు.

ఓపెన్ పరీక్ష ఫీజును 21లోగా చెల్లించండి

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 8: ఓపెన్ ఇంటర్, పదవ తరగతుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ నెల 21లోగా పరీక్ష ఫీజును చెల్లించాలని పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాల అసిస్టెంట్ కో ఆర్డినేటర్ సిజి కిషన్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్ పొందిన వారే కాకుండా సప్లిమెంటరీ విద్యార్థులు కూడా ఫీజును చెల్లించాలని సూచించారు. ఒకవేళ 21 లోగా పరీక్ష ఫీజును చెల్లించని వారు వచ్చే నెల 3 వరకు అపరాధ రుసుముతో చెల్లించవచ్చని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలుంటే 9866343898 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

సదాశివనగర్, ఫిబ్రవరి 8: సదాశివనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపినందుకు మాచర్ల రాజు అనే వ్యక్తికి మేజిస్ట్రేట్ ప్రతాప్ రెండు రోజుల పాటు జైలుశిక్ష, రూ.200ల జరిమానా విధించినట్లు సీఐ సంతోష్ తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు.



దాబాలో పోస్టర్‌ను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

దాబాలో మద్యం తాగితే కేసులు..

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 8: పెద్ద కొడప్‌గల్ మండల పరిధిలో గల దాబాల్లో యజమానులు మద్యం తాగ నీయరాదని, ఒక వేళ మద్యం తాగుతూ ఎవరైన పట్టుబడితే ఆ దాబాను సీజ్ చేస్తామని ఎస్ఐ కోనారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలో గల దాబాలను తనిఖీ చేసి మద్యం తాగడానికి అనుమతి లేదని ఫెక్సీలను అతికించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోనారెడ్డి మాట్లాడుతూ దాబాల్లో మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా దాబాల యజమానులు తమ దాబ పరిధిలో మద్యం తాగనీయరాదని హెచ్చరించారు.

నిరుపేదలకు దుకాణాలను కేటాయించాలి

● సలాబత్‌పూర్ ఆలయం వద్ద మాజీ ఎంపీటీసీ ఆత్మహత్యా యత్నం

మద్నూర్, ఫిబ్రవరి 8: మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు విక్రయించడానికి గాను దేవాదాయశాఖ అనుమతితో సిబ్బంది వేలంపాట నిర్వహించడానికి గురువారం సమావేశం కాగా, స్థానిక మాజీ ఎంపీటీసీ పండరిగౌడ్ దుకాణం వేలం పాటను నిలిపివేయాలని, నిరుపేదలైన వారికి దుకాణాలు కేటాయించాలని ముందుగా ఆలయ కార్యదర్శి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం చేశారు. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి వారించారు. ఈ విషయమై ఆలయ కార్యదర్శి శ్రీధర్‌ను వివరణ కోరగా దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం దుకాణాల వేలం వేస్తున్నామని, ఆత్మహత్య చేసుకున్న వ్యక్తికి దుకాణాలతో ఎటువంటి సంబంధం లేదని, ఈ విషయమై పోలీసులకు వివరించామన్నారు. ఆత్మహత్య ఎందుకు చేసుకున్నారో తనకు తెలియదన్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొనగా వేలం పాట నిలిపి వేశామని తెలిపారు.

సొంత స్థానాలకు వెళ్లిన వైద్యశాఖ సిబ్బంది

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8: వైద్యశాఖలో డిప్యూటేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో గురువారం జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సొంత స్థానాలకు వెళ్లారు. మొత్తం 99 మంది సిబ్బంది డిప్యూటేషన్‌పై ఉండగా అందులో రెగ్యులర్ ఎంప్లాయిస్ 67 మంది, ఎన్‌హెచ్ఎం 24, ఔట్ సోర్సింగ్ 8 మంది సిబ్బంది ఉన్నారు. వైద్య విధాన పరిషత్‌లో మొత్తం 15 మంది సిబ్బంది డిప్యూటేషన్‌పై ఉండగా అందులో 5 మంది వైద్యులు, 5 మంది స్టాఫ్‌నర్సులు, 5 మంది పారా మెడికల్ సిబ్బంది ఉన్నారు.

రామారెడ్డిలో విద్యార్థిని ఆత్మహత్య

రామారెడ్డి, ఫిబ్రవరి 8: రామారెడ్డి గ్రామానికి చెందిన కోదండం భారతి(15) అనే బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గురువారం ఉదయం తండ్రి సాంబ కూతురు భారతిని పాఠశాలకు వెళ్లమని చెప్పి అతని భార్యతో కలిసి ఉప్పల్‌వాయికి కూలి పనికి వెళ్లాడు. పని ముగించుకున్న అనంతరం మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంట్లో కూతురు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లాలని మందలించడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి సాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో వృద్ధురాలి మృతి

మాచారెడ్డి, ఫిబ్రవరి 8: మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామానికి చెందిన ముస్తాబాద్ రామవ్వ(75) అనే వృద్ధురాలిపై బుధవారం వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలపాలైంది. తీవ్రంగా గాయపడిన రామవ్వను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో విచ్చలవిడిగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని అధికారులు వాటిని నివారించే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నాగిరెడ్డిపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో విజయ్‌శేఖర్

రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని సిద్ధి రామేశ్వర ఎరువుల దుకాణాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారి విజయ్ శేఖర్ తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్ రిజిష్టర్‌ను ఆయన పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు నాణ్యమైన మందులను విక్రయించాలన్నారు. ఎరువులు, మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆయన డీలర్ సిద్ధి రాములును ఆదేశించారు.


గురువారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరైన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

నేటి నుంచి అల్లమా ప్రభు జాతర ప్రారంభం

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 8: కోరిన కోర్కెలు తీర్చేవాడు. భక్తుల కొంగు బంగారం అల్లమా ప్రభు అని ఇక్కడ భక్తుల నమ్మకం. కాగా ఈ జాతర శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ జిల్లా శిఖారి పురి తాలూకాలోని బల్లిగావి అల్లమా ప్రభు జన్మ స్థలం. సజ్జని దేవి నిరాహంకారుడు అతని తల్లిదండ్రులు అల్లమా ప్రభుని గురువుడు. అనిమీషుడు తన గురువు ద్వారా పొందిన ఆత్మ లింగాన్ని తీసుకుని దేశ సంచారం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్ పల్లి గ్రామంలోని కొండపై లింగాన్ని మాఘమాసంలో అమావాస్య రోజు ప్రతిష్ఠించారు. ఈ కొండ అల్లమాప్రభు కొండగా పేరు గాంచింది. ఈనెల 9వ తేదీన శుక్రవారం అగ్నిగుండం, అన్నదానం, 10వ తేది శనివారం రథోత్సవం, నిండు జాతర, 11వ తేది ఆదివారం కుస్తీ పోటీలు జరగనున్నాయి. ఈ జాతరకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.


ఆలయంలోని మూల విరాట్టు

సంసిద్ధ యాప్‌పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 8 : సంసిద్ధ యాప్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ప్రగతి నివేదిక అంచనాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని ఎల్లారెడ్డి సీడీపీవో సరిత అన్నారు. గురువారం ఎల్లారెడ్డి సీడీపీవో కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు సంసిద్ధ యాప్ గురించి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌లో డిజిటల్ లైబ్రరీని వినియోగించుకుని చిన్నారులకు బోధించాలని అదే విధంగా పోషణ ట్రాకర్ యాప్‌లో పిల్లల పోషణ ఎత్తు బరువు, నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టైం మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన

బాన్సువాడ, ఫిబ్రవరి 8: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టైం మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. మోటివేటర్ గాలి నరేందర్ మాట్లాడుతూ పరీక్షా సమయంలో ప్రతీ నిమిషాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా చదివినవి గుర్తించుకునేలా నైపుణ్యాలను తెలియజేశారు. పరీక్షా సమయంలో పాజిటివ్ ధృక్పథంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు శివపార్వతి, సిద్ధిరాములు, నాగ్‌నాథ్, దత్తు, రవి, సాయి తదితరులున్నారు.

గౌడ హాస్టల్ కోసం పూర్తి సహకారం: ఎమ్మెల్యే

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హామీ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 8: జిల్లా కేంద్రంలో పేదగౌడ విద్యార్థుల కోసం ఏర్పాటు చేయనున్న గౌడ హాస్టల్‌కు తాను పూర్తిగా అండగా ఉంటానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో తనను కలిసిన గౌడ సంఘం నూతన కమిటీని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి అనంతరం గౌడ హాస్టల్ నిర్మాణం కోసం ప్రభుత్వ సహాయాన్ని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. తాను పూర్తి అండగా ఉంటానని మదన్‌మోహన్ హామీనిచ్చారు. ఈ మేరకు మదన్ మోహన్‌ను కలిసిన వారిలో కామారెడ్డి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు పల్లె రమేష్‌గౌడ్, కార్యదర్శి బాలార్జున్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొంబోతుల లింగాగౌడ్, గౌడ హాస్టల్ డైరెక్టర్ బట్టుపల్లి నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్థులకు స్థలం కేటాయించాలి..

కామారెడ్డిటౌన్: జిల్లాలోని గౌడకులస్థులు ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్‌అలీని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ విద్యార్థుల భవిష్యత్తుకై వెనుకబడిన విద్యార్థుల ఉన్నత చదువుకై జిల్లాలో హస్టల్, అత్యున్నత కోచింగ్ కోసం అన్ని వసతులతో కూడిన బిల్డింగ్ నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు.


ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కత్తెరపురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

తాడ్వాయి,ఫిబ్రవరి 8: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దీని నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న తెలిపారు. తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామంలో గురువారం ఆమె మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు కోరంట్‌రా నిప్రోనిల్ 0.4మి.లీలు లేదా ఇమామె క్టిన్ బెంజయేట్ 0.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీకాంత్, ఏఈవో నవ్యరైతులు గంగారెడ్డి, భైరయ్య పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్‌లో ఇంటింటా సర్వే

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీల అమలుకు మహ్మద్‌నగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహిసున్నారు. బూర్గుల్ గ్రామంలో పంచాయతీ అధికారి అబ్బాగౌడ్, పంచాయతీ కార్యదర్శి సుధారాణిలు ఇంటింటా వివరాల సర్వే నిర్వహించారు. యజమాని పేరు, ఆధార్, రేషన్ కార్డు నెంబర్లు, గ్యాస్ బుక్ తదితర వివరాలను ఇంటింటికి తిరిగి సేకరిస్తున్నామన్నారు.

కిష్టాపూర్‌లో పారిశుధ్య వారోత్సవాలు

బీర్కూర్, ఫిబ్రవరి 8: మండల వ్యాప్తంగా పారిశుధ్య వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ వారోత్సవాలు ఈ నెల 15 వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా గురువారం కిష్టాపూర్ గ్రామంలో పారిశుధ్య సిబ్బంది పరిశుభ్రత పనులు చేపట్టగా, అధికారులు పరిశీలించారు. ప్రత్యేకాధికారి ఏఓ కమల పారిశుధ్య పనులు పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చి దిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కార్యదర్శి కృష్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 8: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి కామారెడ్డి పట్టణానికి చెందిన న్యాయవాది మక్సూద్‌హైమద్ ఆర్థిక సహాయం చేశారు. బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన షేక్ ఉస్మాన్ గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడనిఅతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందనే విషయం తెలుసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయనను పరామర్శించి రూ.20 వేలను అందించారు. తన స్నేహితులతో పాటు తనకు తెలిసిన వారి ద్వారా సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలి

దోమకొండ, ఫిబ్రవరి 8:మండల కేంద్రంలోని మటన్ మార్కెట్ వద్ద మాంసం విక్రయించే చోట పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో, దోమకొండ గ్రామ ప్రత్యేకాధికారి చిన్నారెడ్డి అన్నారు. గురువారం అరె కటికెలతో గ్రామం పంచాయతీలో సమావేశం నిర్వహించారు. మాంసం విక్రయించే స్థలంలో వ్యర్థాలు పడేయవద్దని, దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. ఎవరైన నిబంధనలు పాటించకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీయంహెచ్‌వో

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

రామారెడ్డి, ఫిబ్రవరి 8: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కామారెడ్డి డీయంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య సూత్రాలపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం పట్ల ప్రజలు మంచి పద్ధతులు పాటించాలన్నారు. గర్భశయ, నోటి, రొమ్ము క్యాన్సర్‌లకు సంబంధించి 110 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఎస్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ జయలత, వైద్యులు సౌమ్య, హరిశంకర్, శిరీష, శోభ, మానస, చైతన్య, టీమ్, ఎంపీపీ నారెడ్డిదశరథ్‌రెడ్డి, ఎంపీటీసీలు రజిత రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సీఐగా సంపత్

భిక్కనూరు, ఫిబ్రవరి 8: భిక్కనూరు సీఐగా సంపత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఐగా పనిచేసిన తిరుపయ్య కామారెడ్డి ఎస్బీ-2 సీఐగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లా గౌరారంలో పనిచేసిన సంపత్ సీఐగా పదోన్నతి పొంది బదిలీపై భిక్కనూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం బదిలీపై వెళ్లిన సీఐ తిరుపయ్య మాట్లాడుతూ భిక్కనూరు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తనకు పూర్తిగా సహకరించారని తెలిపారు.

విద్యార్థుల ఔదార్యం

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 8: పట్టణంలోని ఆర్‌కే డిగ్రీకళాశాలలో చదువుతున్న సంపత్, ప్రవీణ్, వినయ్‌లను సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల నుండి ఇంటికి వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు జీవదాన్ పాఠశాల సమీపంలో పడిఉన్న పర్సును గుర్తించి డయల్ 100కు సమాచారం అందించారని తెలిపారు. ఆ పర్సులో రూ.23 వేలతో పాటు పర్సు పోగొట్టుకున్న వ్యక్తి ఐలాపూర్ గ్రామానికి చెందిన కార్తీక్ వివరాలు ఉండడంతో అతనికి పర్సును విద్యార్థుల చేతుల మీదుగా అందించామని తెలిపారు. డబ్బులు దొరకగానే పోలీసులకు సమాచారం అందించి చిన్నపాటి ఉద్యోగం చేసుకునే వ్యక్తికి సహాయపడి తమ ఔదార్యాన్ని చాటుకున్నారని సీఐ తెలిపారు.

యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ ఇలీయాస్

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 8: తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ కుమారుడు ఇలీయాస్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర అధ్యక్షుడు శివసే నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఇలీయాస్‌కు అందజేశారు. అనంతరం ఇలీయాస్ మాట్లాడుతూ.. యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమిం చిన రాష్ట్ర అధ్య క్షుడు శివసేనారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలి పారు. పార్టీ అభివృద్ధికి తన పూర్తి సమయాన్ని కేటాయిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన ఇలీయాస్‌కు జిల్లా కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


మహ్మద్ ఇలీయాస్

కరడ్‌పల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం

తాడ్వాయి, ఫిబ్రవరి 8: మండలం కరడ్‌పల్లి గ్రామంలో గురువారం కామారెడ్డి అసోసియేషన్ ఫర్ రూరల్ ట్రాన్స్‌ర్డేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ప్రత్యేక వైద్యచికిత్సలు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ మైపాల్‌రెడ్డి, నరేష్, పాల కేంద్రం అధ్యక్షుడు నారాయణరెడ్డి, డైరెక్టర్‌లు సంజీవ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పశువైద్యాధికారి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య ప్రసాదం పంపిణీ

బీర్కూర్, ఫిబ్రవరి 8: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి బీర్కూర్ రామాలయానికి ప్రసాదాలు వచ్చాయి. అయితే హిందూ ధర్మ ప్రచార కమిటీ సభ్యులు గురువారం అయోధ్య రామయ్య ప్రసాదాలను బీర్కూర్ మండలంలోని అన్ని గ్రామాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ మందిరం నుంచి ప్రసాదాలు వచ్చాయని, వాటిని అన్ని గ్రామాలకు చేరవేస్తున్నామన్నారు. అనంతరం హిందూ ధర్మ ప్రతినిధులు అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రసాదాలను పంపిణీ చేస్తారని అన్నారు.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8: 2024-25 విద్యాసంవత్సరానికి 9, 11వతర గతుల్లో ఉన్న ఖాళీ సీట్లకోసం ప్రవేశపరీక్షను శనివారం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలో 9, నిజాంసాగర్‌లో 1 పరీక్ష కేంద్రాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లు, బాల్‌పాయింట్‌పెన్, హాల్ టికెట్లో సూచించిన నిబంధనల ప్రకారం తమ పరీక్ష కేంద్రానికి గంటముందుగానే చేరుకోవాలని తెలిపారు.

నూతన కార్యవర్గం

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 8: మహ్మద్‌నగర్ మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు బీజేపీ శ్రేణులు తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడిగా పోలీసు రాజు, ఉపాధ్యక్షులుగా రవి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, యాదయ్య, ప్రధాన కార్యదర్శులుగా చిరంజీవి, వినయ్, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా పండరి, వారితో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉడుగుల రాము, నిజాంసాగర్ మండల అధ్యక్షుడు నరేష్, నాయకులు మల్లికార్జున్, సంగమేశ్వర్, కాశయ్య, తదితరులున్నారు.

బోరుబావి పనుల ప్రారంభం

సదాశివనగర్,ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని బెస్తగల్లిలో బోరుబావి పనులను వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కాలనీలో నీటి ఎద్దడి దృష్ట్యా మండల పరిషత్ నిధుల నుంచి రూ.1లక్ష 50 వేలతో బోరు బావి తవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. బోరుబావిలో నీరు పుష్కలంగా రావడంతో కాలనీలో నీటిఎద్దడి తీరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కమలాకర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకవర్గానికి సన్మానం

నిజాంసాగర్, ఫిబ్రవరి 8: మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో సర్పంచ్ సంధ్యారాణితో పాటు పాలకవర్గం పదవీకాలం పూర్తి కావడంతో ఐదు సంవత్సరాల పాటు సేవలందించిన సర్పంచ్, వార్డు మెంబర్లకు వడ్డేపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. అనంతరం పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు.


సీసీ రోడ్లు, మూత్రశాలలకు నిధుల విడుదల

మద్నూర్, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలో సీసీ రోడ్లు, మూత్రశాలల నిర్మాణానికి గాను ప్రభుత్వం ఎన్ఆర్ ఈజీఎస్ పథకం కింద రూ.19లక్షల నిధులు విడుదల చేసినట్లు మద్నూర్ గ్రామ జీపీ అధికారి బండి విజయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో సీసీ రోడ్లు లేని కాలనీల్లో సీసీ రోడ్లు వేయడానికి, పాత బస్టాండ్ వద్ద మహిళలకు వార సంతతో పాటు మండల కేంద్రానికి వచ్చే మహిళల సౌకర్యార్థం మూత్రశాలలకు నిధులు విడుదలయ్యాయని, సీసీ రోడ్లకు రూ.15లక్షలు, మూత్రశాలలకు రూ.4లక్షలు వచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వేసిన రోడ్లతో పాటు శిథిలావస్థకు చేరుకున్న రోడ్లకు నూతనంగా వేయిస్తామన్నారు. వార సంత సమయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వానికి విన్నవించగా, రూ.4లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. రాబోయే వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. పూర్తి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయనతో పాటు కార్యదర్శి సందీప్ తదితరులున్నారు.

నేడు దోమకొండలో మాఘమ అమావాస్య జాతర

దోమకొండ, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని గుండ్ల చెరువు సమీపంలో గల కటికం మల్లన్న ఆలయాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం మాఘమ అమావాస్య సందర్భంగా కటికం మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున జాతర కొనసాగుతుంది. జాతరకు బీబీపేట, భిక్కనూర్, దోమకొండ, మాచారెడ్డి మండలాల నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరై పూజలు నిర్వహిస్తారు.

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - గుంటూరు కారం
ప్రియా 70 - అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
ప్రియా 35 - కిస్మత్

బాన్సువాడ

మహేశ్వరి - ఈగల్
వెంకటేశ్వర - హనుమాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

